క్లుప్తంగా

డీసెక్షన్ సూపరింటెండెంట్‌పై జేసీ ఆగ్రహం

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని డీ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తీరుపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పిన పనిచేయకపోతే బదిలీ వేటు వేయాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వం 20 ఏళ్ల అనుభవం ఉన్న రైతులకు సంబంధించి అసైన్‌మెంట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను చేపట్టింది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి కలెక్టరేట్‌కు అందుకు సంబంధించి ఫైళ్లు వస్తాయి. వీటిని నిబంధనల ప్రకారం ఈసెక్షన్ చూసుకోవాల్సి ఉంటుంది. ఎక్కువ సంఖ్యలో ఫైల్స్ వస్తుండడంతో స్వయంగా జేసీనే కొన్ని ఫైళ్లను చూసి తనకు నివేదించాలని డీసెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును ఆదేశించింది. అయితే ఆయన జేసీ ఆదేశాలను ధిక్కరించడంతో సోమవారం ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పిన పని చేయకపోతే వేరే చోటుకు బదిలీ చేసి ఆయన స్థానంలో మరొకరిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు.

వాస్తవ సమాచారంతో రండి

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు సమావేశానికి వచ్చే అధికారులు, సిబ్బంది వాస్తవ సమాచారంతో రావాలని కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి అన్నారు. సోమవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం కర్నూలులోని విద్యుత్ భవన్‌లో సీఎండీ సమీక్షా సమావేశం జరగనుందని, ఇందులో అన్ని విభాగాల పనితీరును పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు డీఈఈలు, ఏఈఈ, అకౌంట్స్ అధికారులు పక్కా సమాచారంతో హాజరు కా వాలని సూచించారు.

పేదలకు అన్నదానం

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నగరంలోని పలుచోట్ల పేదలకు అన్నదానం నిర్వహించా రు. నిరాశ్రయుల వసతి గృహం, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రజాపరిరక్షణ సమితి అధ్యక్షులు కె.బలరామ్, గౌరవ అధ్యక్షులు పద్మానంద యోగి, నాయకులు డేవిడ్, డైమండ్ అబ్దుల్ సలాం, దాస్, రవికుమార్, శివమ జీ, శ్రీరాములు, రవి ప్రసాద్, ఈశ్వర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కర్నూలు(సెంట్రల్): నెల రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన ఆటో డ్రైవర్ ఎల్లప్ప కుటుంబానికి ఏపీ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ అండగా నిలిచింది. సోమవారం సంఘం న్యూసిటీ కమిటీ తరపున రూ.20 వేలను వారి కుటుంబానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, బి.రాధాకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల కుటుంబానికి ఉచిత ప్రమాద బీమాను అమలు చేయాలని కోరారు.

కేవీపీఎస్ జెండావిష్కరణ

కర్నూలు(సెంట్రల్): కుల వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఇందిరాగాంధీ నగర్‌లో సంఘం జెండాను సోమవారం సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి టి.షడ్రక్ సతీమణి టి.అన్నపూర్ణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల వివక్షతను పాటించడం అన్యాయమన్నారు. దీనిపై ప్రజల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు యేసురాజు, డాక్టర్ వినోద్, పీఎస్ రాధాకృష్ణ, ఆర్.నరసింహులు, ఎం.భాస్కర్, టి.రాముడు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన

కర్నూలు (టౌన్): బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మెప్మా టౌన్ ప్రాజెక్టు అధికారిణి వెంకటలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక మెప్మా కార్యాలయం నుంచి నగరపాలక సంస్థ వరకు మహిళా గ్రూపులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వయస్సులోనే తల్లిదండ్రులు ఆడపిల్లలకు వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఓలు నగేష్, సుధాకర్ పాల్గొన్నారు.

జలం శ్రీనుకు నివాళి

కర్నూలు సిటీ: స్థానిక రాయలసీమ విద్యార్థి పోరాట సమితి కార్యాలయ ఆవరణంలో సోమవారం రాయలసీమ ఉద్యమకారుడు జలం శ్రీను వర్ధంతిని నిర్వహించారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్, జిల్లా అధ్యక్షులు అశోక్, రాష్ట్ర నాయకులు సుంకన్న, రవికుమార్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొని జలం శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని నినాదాలు చేశారు.

రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): 2021–22 ఆర్థిక సంవత్సరంలో కావేరి–జాదు నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శిజి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. కోర్టు ఆదేశాల మేరకు రైతుల పక్షాన నిర్ణయం తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.కోటకొండ సూరి, పెంచికలపాడు నగేష్, మునగాలపాడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

సురక్ష శిబిరాలతో మెరుగైన వైద్యం



కొత్తపేట శిబిరంలో సురక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

● ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని 8, 9, 48వ వార్డుల పరిధిలోని 20, 21, 22, 23, 123వ సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి అక్కడ అందుతున్న సేవలను తెలుసుకున్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఇప్పటికే ఎన్నో వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చడం, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించి ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు కర్రా హర్షవర్దన్ రెడ్డి, 8వ వార్డు ఇన్‌చార్జ్ అబ్రార్, సీహెచ్ మద్దయ్య, తెలుగు అనిల్‌కుమార్, నవీన్, 48వ వార్డు కార్పొరేటర్ మల్లికాబేగం, 9వ వార్డు కార్పొరేటర్ పుల్లమ్మ, సచివాలయ కన్వీనర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాలకు మేలు

● ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు చేకూరుతోందని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం 47వ వార్డు ధర్మపేటలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బుక్‌లెట్లను అందజేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బతుకులు మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన అనేక సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ మేలు జరుగుతోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని తరహాలో పాలన సాగిస్తున్న జగనన్నను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ అరుణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కర్ర హర్షవర్దన్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, ఆదిమోహన్‌రెడ్డి, భారతి, సుధాకర్, సందీప్, లక్ష్మన్, లాజర్, బాషా, నాగరాజు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సలో అనెస్తీషియా పాత్ర కీలకం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వైద్యచికిత్సల్లో అనెస్తీషియా పాత్ర కీలకమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. సోమవారం మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో నిర్వహించిన వరల్డ్ అనెస్తీషి యా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ యూనిట్లు, ఏఎంసీ, ఎమర్జెన్సీ మెడిసిన్, గైనిక్, జనరల్ సర్జరీ విభాగాల్లో అనెస్తీషియా వైద్యులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్‌లలోనూ వీరి సేవలను ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. అనెస్తీషియా, క్రిటికల్ కేర్‌లో వచ్చిన మార్పులపై హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రాంబాబు ప్రసంగించారు. సాయంత్రం డాక్టర్స్ కాలనీలోని ఐఎంఏ భవన్‌లో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు(సీఎంఈ) నిర్వహించారు. ఇందులో మెడికో లీగల్ ఆస్పెక్ట్స్ టు అనెస్తెటిస్ట్స్‌పై డాక్టర్ నరసింహారెడ్డి, కామన్ ఎర్రర్స్ ఇన్ అనెస్తీషియా ఫర్ ఆల్ ప్రాక్టీషనర్స్‌పై డాక్టర్ టి.రాంబాబు వివరించారు. అంతకుముందు ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డాక్టర్ హరిచరణ్, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అనెస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విశాల, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ రామశివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జన జాగృతం.. జగన్మాత రూపం



బుధవారపేటలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



పెద్దమ్మ వారి శాలలో..



చిన్నమ్మ వారి శాలలో..



గీతామందిరంలో..



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో..

● శరన్నవరాత్రి రెండో రోజు వేడుకల్లో విశేష అలంకరణలో అమ్మవారు





గీతా మందిరంలో పూజల్లో పాల్గొన్న మహిళలు, లలితా పీఠంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం నగరంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అభిషేకం, హోమాలు, రథోత్సవం, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు పూజలు చేశారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయం, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయం, చిన్న అమ్మవారి శాల, బుధవార పేట కాళికాంబ ఆలయంలో గాయత్రీ దేవిగా, పెద్ద అమ్మవారిశాలలో అన్నపూర్ణగా, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో అన్నపూర్ణగా, వన్‌టౌన్ గీతా మందిరంలో శ్రీరాజా రాముడిగా, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయంలో రాజారాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. బండిమెట్ట అంబా భవానీ ఆలయం, వన్‌టౌన్ కాళికాంబ ఆలయం, ఆరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయం, సూర్యనారాయణస్వామి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు.

ఆధ్యాత్మికతతోనే సన్మార్గం

● నగర మేయర్ బీవై రామయ్య



బెలూన్లు గాలిలోకి వదిలి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): చిన్ననాటి నుంచే ఆధ్యాత్మికతను అలవరుచుకుని సన్మార్గంలో నడవాలని నగర మేయర్ బీవై రామయ్య సూచించారు. సోమవారం స్థానిక కోల్స్ కళాశాల మైదానంలో చైల్డ్ ఇవాంజిలిజమ్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 12వ చిల్డ్రన్స్ క్యాంపు గుడ్ న్యూస్ పేరుతో నిర్వహించిన మూడు రోజుల కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైల్డ్ ఇవాంజిలిజమ్ పేరుతో చేస్తున్న ఇటువంటి కార్యక్రమాలు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. క్యాంపు డైరెక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ పిల్లల్లో చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మిక భావాలను పెంచేందుకు మూడు రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆధ్యాత్మిక బోధనలు, భక్తి గీతాలు, పప్పెట్ షో, బైబిల్ క్విజ్ ఉంటాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా ఆడిట్ ఆఫీసర్ అంబ్రోజ్, కోల్స్ కళాశాల ప్రిన్సిపాల్ జాన్సీరాణి, కమిటీ చైర్మన్ అనిల్ నాథ్, వైస్ చైర్మన్ పి. విజయ్‌కుమార్, పాస్టర్ సన్ని ఐజక్, పాల్ అగస్టీన్, డేవిడ్, రవికుమార్ పాల్గొన్నారు.

పార్టీ నుంచి గుప్తాను బహిష్కరించాం

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ నుంచి సత్యనారాయణ గుప్తాను బహిష్కరించామని ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అనంత కరుణకారబాబు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడిగా కె.బాబురావును ఇటీవల అధిష్టానం నియమించిందన్నారు. అయితే బాబురావు రౌడీ, గుండా అని, ఏసీ గదుల్లో కూర్చొని నియామకాలు ఎలా చేస్తారని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుపై సత్యనారాయణ గుప్తా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. అలాగే ఓటరు జాబితా సవరణపై జరుగుతున్న సమావేశాలకు రాజకీయ పార్టీ ప్రతినిధుల తరపున కాంగ్రెస్ నుంచి వెళ్లిన గుప్తా వ్యవహారంపై కూడా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇక నుంచి కాంగ్రెస్ పార్టీకి గుప్తాకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

శౌర్య జాగరణ యాత్ర విజయవంతం

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో చేపట్టిన శౌర్య జాగరణ యాత్ర విజయవంతమైందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ తెలిపారు. సోమవారం వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 30న చేపట్టిన యాత్ర ఈనెల 14న గూడూరు మండల కేంద్రంలో ముగిసిందన్నారు. హిందువుల సమైక్యత కోసం చేపట్టిన యాత్ర సఫలీకృతమైందన్నారు. జిల్లా కార్యదర్శి భానుప్రకాష్ మాట్లాడుతూ వీహెచ్‌పీ షష్ట్యబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హిందూ సంఘటితం కోసం యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా భజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలే దేశ యజమానులు

కర్నూలు కల్చరల్: ప్రజలే దేశానికి యజమానులని ప్రజాస్వామిక సర్వసత్తాక లౌకిక గణతంత్ర దేశంలో పాలకులు కేవలం కార్పొరేట్ సంస్థల అధిపతులనే యజమానులుగా మార్చారని ప్రముఖ వైద్యులు, జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆయన రచించిన 'భారత ప్రజలమైన మేము ఈ దేశ యజమానులం' పుస్తకాన్ని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ అదానీ, అంబానీ లాంటి ధనికులకే దేశంలోని ఆస్తులన్నీ కట్టబెడుతూ సామాన్యులపై రోజురోజుకు పన్ను పోటు పెంచుతున్నారన్నారు. పెట్టుబడిదారులు భారీ స్థాయిలో బ్యాంకు రుణాలు, బకాయిలు చెల్లించాల్సి ఉండగా వాళ్లకే రాయితీలు, మాఫీలు ప్రకటించి సామాన్యులపై ఆ రుణభారాన్ని మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మియ్యా, రచయితలు శేషాద్రిరెడ్డి, ఇనాయతుల్లా, ఎస్‌డీవీ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం ఆచరణీయం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రవక్త మార్గం ఆచరణీయమని ముస్లిం మత గురువు సయ్యద్ ముబష్షిర్ పాషా ఖాద్రీ అన్నారు. ప్రవక్త జియారత్ సందర్భంగా సోమవారం రాత్రి అశోక్ నగర్‌లోని ఖమర్ మంజిల్‌లో జియారత్ ఏ ము ఏ ముబారక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం శాంతి మార్గాన్ని సూచించిందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రవక్త మంచినే కోరారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సర్వ మానవాళి మేలు కోసం తపించారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ, నూరుల్లా ఖాద్రీ, మాసూం ఖాద్రీ పాల్గొన్నారు.

కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన రైతులు పెద్ద ఎత్తున కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. అంతకుముందు అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో లోటు వర్షపాతం నమోదైందన్నారు. పత్తి, వేరుశనగ, ఆముదం, కంది, మిరప, టమాటా తదితర పంటలన్నీ ఎండిపోవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోందన్నారు. అన్నదాతలను ఆదుకోవడానికి ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో పెండింగ్‌లోని వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను నిర్మించాలని డిమాండ్ చేశారు. హెబ్బటం, పి.కోటకొండకు చెందిన ఇద్దరు రైతులు ఒకేరోజు ఆత్మహత్య చేసుకున్నా ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.జగన్నాథం, ఎస్‌ఎన్ రసూల్, మునెప్ప, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి, రైతులు కొత్తపల్లి గిడ్డయ్య, అనుమంతు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నాయ వ్యవస్థనే తప్పుపట్టేలా టీడీపీ కార్యక్రమాలు

కర్నూలు(రాజ్‌విహార్): చంద్రబాబు అరెస్టు విషయంలో న్యాయ వ్యవస్థనే తప్పుపట్టేలా టీడీపీ కార్యక్రమాలున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. సోమవారం స్థానిక సి.క్యాంప్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు విడుదల కోర్టు పరిధిలో ఉందని, అది రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమం పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, యూనుస్, లక్ష్మీ కాంతయ్య, నాయకులు రాముడు, బేగ్, మల్లేష్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను స్కిల్డ్ వర్కర్లుగా పరిగణించాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ ఫీల్డ్ అసిస్టెంట్లను స్కిల్డ్ వర్కర్లుగా పరిగణించాలని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రామరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఫార్మాసిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఫార్మాసిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఫార్మాసిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.రంగస్వామి కోరారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఏఓ అరుణకు సోమవారం అసోసియేషన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఫార్మాసిస్టులు బదిలీలు, పదోన్నతుల విషయంలో ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.రాజేష్ నాయక్, జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, సత్యప్రసాద్, వీరాంజనేయులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఏపీ వక్ఫ్ ట్రిబ్యునల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా జాఫర్ హుసేన్ బేగ్



కర్నూలు(లీగల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎం.జాఫర్ హుసేన్ బేగ్‌ను నియమిస్తూ వక్ఫ్ బోర్డు ముఖ్య పరిపాలన అధికారి ఎల్. అబ్దుల్ ఖాదర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన నియామకం పట్ల జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం నాయుడు, చక్రపాణి, సీనియర్ న్యాయవాదులు ఎదిరే శ్రీనివాసులు, సత్యారెడ్డి, జి.చలపతిరావు, ఎ.అనిల్‌కుమార్, షకీల్ అహ్మద్ సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామంజనేయులు, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రజలపై భారాలు మోపడం సరికాదన్నారు. ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ న్యూసిటీ కార్యదర్శి రాముడు, నగర కార్యదర్శి రాజశేఖర్, నాయకులు గురుశేఖర్, సాయిబాబా, సుధాకరప్ప, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి పెద్దపీట



మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం ఏక్యాంపులోని మదర్ థెరిస్సా డిగ్రీ కాలేజీలో 10వ తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య కోర్సులపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశ పెట్టారని, ఆయన బాటలోనే ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేనటువంటి డిజిటల్ విద్యను తీసుకొచ్చారన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తున్నానన్నారు. సదస్సులో ఐఐటీ, నీట్, పాలిటెక్నిక్, అంబేడ్కర్, గురుకుల పాఠశాలల్లో ప్రవేశం, ఏపీఆర్‌జేసీ కాలేజీల్లో ప్రవేశాలపై ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, ఇంగ్లీష్ సబ్జెక్టుపై జరీనా, ఫిజిక్స్‌లో రఘునాథ్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

● డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తమ కుమార్తెలకు బాల్యవివాహాలు చేయకుండా చూడాలని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ–వైకేపీ కార్యాలయంలో బాల్య వివాహ రహిత భారతదేశమే తమ లక్ష్యం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై పొదుపు మహిళలకు గ్రామ, మండల, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సెర్ప్ సీఈఓ ఆదేశించారన్నారు. పదేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం బాల్య వివాహాలు బాగా తగ్గాయన్నారు. పేదరికం కారణంగా గ్రామీణులు తమ బిడ్డలకు చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేసి బరువు తగ్గించుకోవాలనే లక్ష్యంతో ఉన్నారని, ఇటువంటి వారిలో చైతన్యం తీసుకరావాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని పేదరికం నుంచి బయటపడాలని సూచించారు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదనపు పీడీ శ్రీధర్‌రావు, డీఆర్‌డీఏ పరిపాలనాధికారి షరీఫ్, డీపీఎంలు నరసమ్మ, అయ్యమ్మ, అనిల్‌కుమార్ ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

సేవా లోపం.. వినియోగదారుల కమిషన్ ఆగ్రహం

● రైతులకు రూ.12.50 లక్షలు 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశం

కర్నూలు (లీగల్): రైతులు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసిన కందిపప్పును ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యంపై జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రైతులు నమ్మకంతో ఉంచిన కందిపప్పును మూడేళ్లు గడిచినా ఇవ్వకపోవడం సేవా లోపమేనని స్పష్టం చేసింది. రైతులు నిల్వ చేసిన 571 బ్యాగుల కందిపప్పు విలువ రూ.12.50 లక్షలను 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. అలాగే మరో రూ.35 వేలు పరిహారం, కోర్టు ఖర్చులకు చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ సోమవారం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళ్తే... కల్లూరు మండలం పెద్దపాడు ప్రాంతానికి చెందిన వి.పరమేశ్వర్‌రెడ్డితో పాటు మరికొందరు రైతులు నన్నూరు సమీపంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్‌లో 571 బస్తాల కందిపప్పును ఫిబ్రవరి 2019 నుంచి 2020 ఫిబ్రవరి వరకు నిల్వ చేయాలని కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నారు. 2020 ఫిబ్రవరిలో తాము నిల్వ చేసిన కందిపప్పు, బస్తాలు ఇవ్వాలని కోరినా కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం స్పందించకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు.

ప్రాధాన్యతా క్రమంలో ఫిర్యాదులను పరిష్కరిస్తాం



స్పందనలో కమిషనర్‌కు విన్నవిస్తున్న కాలనీ వాసులు

కర్నూలు (టౌన్): నగర ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా కమిషనర్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు.స్పందనలో మున్సిపల్ ఎస్ ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, నగరపాలక మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కర్నూలు (సిటీ): నగరంలోని మౌర్యా ఇన్ సర్కిల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బషీర్ అహ్మద్ (60) వెంకటరమణ కాలనీలో నివాసముంటున్నాడు. ఈయన పాతబస్టాండ్‌లో ఓ దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చే సందర్భంలో ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలతో పడివుండగా స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య శాలిబీ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.